ప్రజాశక్తి
బుధవారం 4 జనవరి 2023
5
అనంతపురం



సిఐటియు రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు



ప్రతినిధుల సభలో పాల్గొన్న అనంతపురం సిఐటియు ప్రతినిధులు

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన సిఐటియు నాయకులు ప్రతినిధుల హోదాలో మహాసభల్లో పాల్గొన్నారు. టి.షడ్రక్, సావిత్రమ్మ నగర్(అల్లూరి శ్రీరామరాజు కళ్యాణమండపం)లో జరిగిన మహాసభల్లో కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతినిధులు చర్చలు జరిపారు.



నెత్తిన పెట్టెలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోని ప్రభుత్వం

మెస్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచాలి
ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో వసతులను కల్పించకుండా వాటిని విస్మరిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెరిగిన నిత్యావసర వస్తువులు, సరకుల ధరలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని, హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం నాడు నిరసన తెలిపారు. టవర్‌క్లాక్ వద్ద విద్యార్థుల ట్రంకు పెట్టెలను తలపై పెట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఓతూరు పరమేష్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంక్షేమ ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థలను నిర్వీర్యం చేసే పద్ధతులను అనుసరిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి సంక్షేమ వసతిగృహాల్లో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2018 ధరల ప్రకారం కాకుండా 2023 సంవత్సరానికి అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థులకు దుబ్బట్లు, ప్లేట్స్, గ్లాసులు, ట్రంకు పెట్టెలను వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సూర్యప్రకాష్, వినోద్, సాగర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఆరా



- నేడు కేంద్ర ఎన్నికల సంఘం రాక
- ఉరవకొండలో పర్యటన
- పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ఫిర్యాదుపై దర్యాప్తు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆరా తీస్తోంది. నేడు అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపాల్ సెక్రటరీ అవినాష్ కుమార్ నేడు జిల్లాకు రానున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉరవకొండకు చేరుకుంటారు. విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామం పరిధిలోని 47,48 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్ల జాబితా నుంచి సుమారు నాలుగు వేల ఓటర్లను తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై క్షేత్ర స్థాయి పర్యటన నేడు జరుపునుండటం గమనార్హం.

ఓటర్ల జాబితాలో అవకతవకలపై పిఎసి ఛైర్మన్, ఉరవకొండ శాసనభ్యులు పయ్యావుల కేశవ్ ఫిర్యాదుతో విచారణ మొదలైంది. కేశవ్ గత ఏడాది అక్టోబరు 27వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై నవంబర్ 3వ తేదీన స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం సమగ్రమైన నివేదికివ్వాలని కోరింది. పదేపదే కోరినా స్పందించకపోవడంతో నవంబరు 10వ తేదీన మరోమారు ఎన్నికల సంఘం జిల్లా అధికారులకు 24 గంటల్లో నివేదికివ్వాలని ఆదేశించారు. మొత్తం నవంబరు 21వ తేదీన జిల్లా కలెక్టర్ దీనిపై నివేదికను ఎన్నికల సంఘానికి పంపించడం జరిగింది. దీనిపై సంతృప్తి చెందని పయ్యావుల కేశవ్ డిశెంబరు 7వ తేదీన మరోమారు కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తరం రాశారు. డిశెంబరు 13వ తేదిన గుంతకల్లు ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. డిసెంబరు 29వ తేదీన విచారణ నివేదిక రూపొందింది. తదనంతరం ఈనెల 3వ తేదీన విచారణ నివేదిక ఆధారంగా చీకలగురికి గ్రామం పరిధిలోని 47,48 పోలింగ్ బూత్ అధికారులైన టి.గోపి, మీనుగ మధు అనే ఇద్దరిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఇది జిల్లాలో చర్చనీయాంశమైంది. జిల్లా అధికారులు మాత్రం దీనిపై నేరుగా స్పందించడం లేదు. అక్రమాలు జరిగినందుకు కాదని, జాబితా రూపొందించడంలో మార్గదర్శకాలు సక్రమంగా పాటించనందునే వారిపై చర్యలు తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇదే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపాల్ సెక్రటరీ నేరుగా జిల్లాకు వచ్చి జాబితాలోని అవకతవకలపై ఆరా తీయనుండటం అధికారుల్లో గుబులు రేపుతోంది. ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ఎన్నికల జాబితాలో అవతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇతర నియోజకవర్గాల్లోనూ వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన వారి పేర్లు కూడా కొన్ని జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో కొన్ని చోట్ల అత్యధిక ఓట్లు చేర్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాపై దృష్టి సారించడం, నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు విచ్చేసి విచారణ చేపట్టడం అధికారుల్లోనూ గుబులు రేపుతోంది. ఎవరిపై ఎటువంటి చర్యలుండనున్నాయన్న గుబులు రేగుతోంది.



లబ్ధిదారులకు పింఛన్ల మెగా చెక్కును అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

పేదలందరికీ పింఛన్లు

- 10,143 మందికి కొత్త పింఛన్లు
- జిల్లా వ్యాప్తంగా 2,79,313 మందికి లబ్ధి
- జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం పని చేస్తోందని జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నాడు స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో 'వైఎస్సార్ పింఛన్ కానుక' పెంపు సందర్భంగా పింఛన్ల పెంపు వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మొక్కుబడిగా ఆడంబరాల కోసం కాకుండా చిత్తశుద్ధితో అందించగలిగితే ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగు పరచొచ్చని అని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. అందులో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని జిల్లాలో చేకూరుస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో కొత్తగా 10,143 మందికి ఈ నెల నుంచి పింఛన్ మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులైన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించాలనే ఉద్దేశంతో పలువురికి నోటీసులు ఇచ్చామని, ఇందులో ఆందోళన చెందాల్సిన అంశమేమీ లేదన్నారు. ఈ నెల 7వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పెంపు వారోత్సవాలు నిర్వహించి, ప్రతి లబ్ధిదారుని దగ్గరికీ వెళ్లి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపిస్తామని చెప్పారు. అనంతరం రూ.78 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కడప జోన్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, గ్రంథాలయ ఛైర్‌పర్సన్ ఉమా మోహన్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖితతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పింఛను లబ్ధిదారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అఖిలపక్ష, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నకిలీ విత్తనాలు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లోని ఎపి రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్‌లో వేసిన పత్తి పంట దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలో ఇతర పంటల కన్నా అత్యధికంగా పత్తి పంట రైతులు సాగు చేసినట్లు తెలిపారు. దీన్ని ఆసరాగా చేసుకున్న విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను కష్టాల్లో నెట్టివేశారని వాపోయారు. ప్రభుత్వం కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోగా వెనుకోచ్చేలా వ్యవహరించడం అన్యాయంగా ఉందన్నారు. తక్షణమే పత్తి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా జనవరి 5న కర్నూలు ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు పెద్ద ఎత్తున మూడు జిల్లాల రైతులు పాల్గొని జయప్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు విటి.రామాంజినేయులు, జిల్లా కమిటీ సభ్యులు నల్లప్ప, శివారెడ్డి, రామాంజినేయులు, రామచంద్రుడు, నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించాలి

పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్‌ఇకి వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వినతిపత్రం సమర్పిస్తున్న పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక నాయకులు

కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు ఎస్.అబ్దుల్ రసూల్, ప్రధాన కార్యదర్శి ఎజి.రాజమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఎం జగన్‌కు లేఖ రాయడంతోపాటు విద్యుత్ శాఖ ఎస్‌ఇని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కరణలో పేరుతో ప్రభుత్వం వ్యవసాయం కోసం ఉచిత విద్యుత్ పొందుతున్న రైతులకు కూడా మీటర్లు బిగించడం బాధాకరమన్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని దశలవారీగా రద్దు చేయాలన్న కుట్రలో భాగమే మీటర్ల బిగింపు అన్నారు. అలాగే ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్ అందజేస్తామని, దాని ధరను వినియోగదారుల నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. అలాగే డిస్కామ్‌ను ప్రయివేటీకరించే ఎత్తుగడను విరమించుకోవాలన్నారు. ఆయా సమస్యలను సానుకూలంగా పరిశీలించి సంస్కరణలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక జిల్లా నాయకులు శ్రీనివాసరావు, ఎంఎన్‌టి.రాజు, సోమర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్ రెడ్డి గృహ నిర్బంధం

మున్సిపల్ కార్యాలయంకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డిని పోలీసుల గృహ నిర్బంధం చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్తుండగా శాంతిభద్రతల దృష్ట్యా అనుమతి లేదంటూ పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జెసి పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ హోదాలో తాను మున్సిపాల్టీకి వెళ్తుంటే అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. ఈ నేపథ్యంలో కొంతసేపు జెసి ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తాడిపత్రి పట్టణంలోని ఎఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం తాడిపత్రి పట్టణ, రూరల్ మండలంకు సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరు అయ్యారు. ఇదే కార్యక్రమానికి తాడిపత్రి మున్సిపాల్టీ నుంచి ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో జెసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో జెసి ఇంటి వద్దకు చేరుకుని ఆయన్ను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జెసి.ప్రభాకర్‌రెడ్డి ఒకే కార్యక్రమంలో పాల్గొంటే శాంతిభద్రతల సమస్య నెలకొంటుదన్న ఉద్దేశంతో పోలీసులు జెసికి 41 నోటీసు ఇచ్చి ఆయన్ను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఛైర్మన్‌గా ఉన్న తనను అడ్డుకోవడం ఏమిటంటూ జెసి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినా పోలీసులు ఆయన్ను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో జెసి ఇంట్లోనే ఉండిపోయారు. తాడిపత్రిలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు - పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు



తెగిన విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని కడవకల్లు గ్రామంలో మంగళవారం విద్యుత్ వైర్లు రోడ్డుపై తెగిపడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ తీగలు తెగే సమయానికి ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎ.కొండాపురం-తిమ్మంపల్లి ప్రధానా రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు ఉంటాయన్నారు. అలాంటి రహదారిలో విద్యుత్ తీగలు నాసిరకంగా ఉండటం బాధాకరమన్నారు. వెంటనే విద్యుత్ తీగలు మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, సిపిఎం మండల నాయకులు జి.వెంకటచౌదరి, వి.వెంకటశేఖర్, బి.భాస్కర్‌రెడ్డి, టి.పెద్దయ్య, టి.నాగమునేంద్ర, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి సిఎం జగన్

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, టిడిపి నాయకులు

ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో బీసీలకు అన్యాయం చేసి బీసీల ద్రోహిగా మిగిలిపోయారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో బీసీ సెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య అధ్యక్షతన బీసీ సెల్ అనంతపురం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు సావిత్రీబాయి పూలే పాటుపడ్డారని తెలిపారు. ప్రస్తుతం సిఎం జగన్ రాష్ట్రంలో అసమానతలను నెలకొల్పుతున్నారన్నారు. కేవలం నలుగురు వ్యక్తుల సంపద కోసం రాష్ట్ర ఖజానాను దోచుకుని దాచుకుంటున్నారని మండిపడ్డారు. బీసీలకు 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారుగానీ, నిధులు కేటాయించడం మరిచిపోయారన్నారు. ముఖ్యంగా జనాభాలో సగభాగమున్న బీసీల ఐక్యత టిడిపితోనే సాధ్యమన్నారు. సాధికారిక కమిటీలను ఏర్పాటు చేయడంలో జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాత్రను కొనియాడారు. బీసీలకు వ్యక్తిగత రుణాలు, ఆదరణ పనిముట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను, మంత్రివర్గంలో బీసీలకు చోటు కల్పించడం వంటివి టిడిపితోనే సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వంలో బిసిలకు మొండిచేయి తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు జిల్లాల పర్యటనలకు విశేష ప్రజా స్పందన వస్తుండటంతో ప్రభుత్వానికి వణుకు పుట్టిందన్నారు. అందుకే ఎలాగైనా పర్యటనలను ఆపాలని తొక్కిసలాటలో మృతిచెందడాన్ని సాకుగా చూపి నిషేధించారని ఆరోపించారు. టిడిపి జిల్లా బీసీ విభాగం ఆధ్వర్యంలో గుంతకల్లులో పెద్ద ఎత్తున బీసీల సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కురుగుంట బ్రహ్మయ్య, 5వజోన్ ఇన్‌ఛార్జి జరిపిటి నరసింహులు, అనంతపురం పార్లమెంట్ బీసీ సెల్ ఇన్‌ఛార్జి ఆనంద్‌కుమార్, సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్లు విశాలాక్షి, గంగులకుంట రమణ, వడ్డే వెంకట్, పోతులయ్య, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, జిల్లా నాయకులు ధనార్జన, సురేంద్ర, చాపల హరి, కృష్ణ, ఆదియాదవ్, గోసుల సుబ్బయ్య, కొయ్యగూర పెద్దన్న, వాల్మీకి ప్రతాప్‌నాయుడు, వాల్మీకి రవి, పూజారి తిప్పయ్య, ఆనంద్, సీఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటకు గడ్డిమందు పిచికారీ

ద్విచక్ర వాహనానికి నిప్పు



గడ్డి మందు పిచికారి చేసిన మిరప పంట, కాలిన ద్విచక్ర వాహనం

బొమ్మనహాల్ : మండలంలోని కలవలతిప్ప గ్రామంలో రైతు చాకలి నాగేంద్రకు చెందిన నాలుగెకరాల మిరప పంటకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి గడ్డి మందు పిచికారి చేశారు. అంతేగాకుండా అర్ధరాత్రి ఇంటి వద్ద ఉన్న తన ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఉదయం 8 గంటలకు చేరుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులను గ్రామానికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా రైతు మిరప పంటకు గడ్డిమందు పిచికారి చేయడంపై రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పొలాల్లో ఎక్కడికక్కడే వరిధాన్యం, మిరపపంట, మొక్కజొన్నలు ఆరబోశామని, ఇలా చేస్తే ఎలా వాపోతున్నారు. కాగా రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ముఖహాజరు నమోదు తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ముఖ ఆధారిత గుర్తింపు హాజరు తప్పనిసరి అని కమిషనర్ బాగ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఉదయం నగరపాలక సంస్థలోని మినిస్టీరియల్ ఉద్యోగులు తమ ఫోన్లలో యాప్ డౌన్లోడ్ చేసుకుని సిఎఫ్ఎంఎస్ ఐడి, పాస్వర్డ్‌తో లాగిన్ అయ్యి ముఖ ఆధారత హాజరు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంకా కొందరు ఉద్యోగులు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. వారందరూ కూడా నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డిను ఆదేశించారు. అలాగే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అలసత్వం వీడాలన్నారు. అర్జీదారునికి అందించే సమాచారాన్ని క్లుప్తంగా ఎండార్స్‌మెంట్ రూపంలో పొందుపరిచి అర్జీదారులతో ఫొటో తప్పనిసరిగా తీసుకుని స్పందన గ్రీవెన్సని క్లోజ్ చేసేలా ఖచ్చితమైన నిర్దేశాలను పాటించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగం పొందిన విద్యార్థినికి ఎస్పీ అభినందన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విద్యార్థినికి మెమొంటో అందజేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

పోలీస్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీలో పోటీ పరీక్షల నిమిత్తం చదువుకుంటున్న శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని లావణ్య కర్నాటక గ్రామీణ బ్యాంక్‌లో ఉద్యోగం పొందింది. ఈ సందర్భంగా మంగళవారం నాడు ఎస్పీ డా॥ఫక్కీరప్ప స్థానిక పోలీసు కాన్ఫిరెన్స్ హాల్లో ఆమెను సతకరించి, జ్ఞాపికను అందజేశారు. తనకు ఉద్యోగం రావడంలో అనంతపురం పోలీస్ లైబ్రరీ ఎంతో దోహం చేసిందని విద్యార్థిని లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

జయంతి వేడుకల్లో పలువురు అధికారులు, వక్తలు


మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన సావిత్రిబాయి పేలే సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయని పలువురు అధికారులు, వక్తలు పేర్కొన్నారు. సావిత్రి పూలే జయంతి వేడుకలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ శాఖలు, ప్రజా మహిళా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన శ్రీసాయి డిగ్రీ కళాశాల, నలందా కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన, సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నబీరసూల్, నలంద కళాశాల ప్రిన్సిపల్ ఖాజీబాబు, రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎంఎం.మోహన్‌రెడ్డి, గ్రంథాలయ ఉప అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్, రామాంజనమ్మ, కావేరి తదితరులు పాల్గొన్నారు. అలాగే బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు స్థానిక శారదా నగర్‌లోని కెఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కెఎస్ఎన్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి రంగయ్య, ఎస్‌కే ఓబులేష్, రాజు, దిలీప్, నాగరాజు, భాషలి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, నగర రూరల్ కార్యదర్శి రాజా, నగర అధ్యక్షులు అక్కులప్ప, నాయకులు వన్నూరు, మురళి, నల్లప్ప, లక్ష్మణ్, వన్నూరప్ప, నాగరాజు, ఓబులేష్, సురేష్, రవికుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక అరవింద నగర్‌లోని బచ్‌పన్ స్కూల్లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ స్కూల్ ఛైర్మన్ దాదాగాంధీ, ప్రిన్సిపల్ సరితారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిపత్రి : భారత తొలి మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్య కోసం ఎనలేని కృషి చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే అని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి, జిల్లా కమిటీ సభ్యురాలు నాగరాణి, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ కొనియాడారు. సావిత్రి పూలే జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థ పట్ల, విద్య సమాజానికి దారి చూపే తీరు పట్ల ఆమెకు ఎంతో స్పష్టత ఉందన్నారు. విద్యాకమిషన్‌ను నియమించేటప్పుడు మాతృభాషలో విద్య అందించాలని, శూద్ర, అతి శూద్ర కులాల వారికి పాఠశాలలు పెట్టాలని, పేదరికం వల్ల దిగువ కులాల పిల్లలకు 12 సంవత్సరాల వయస్సు వరకు ఉపకార వేతనం మంజూరు చేయాలని, గిరిజన తెగ కులస్థులకు ప్రత్యేక పాఠశాలలు పెట్టాలని సావిత్రీబాయి పూలే ప్రతిపాదనలు పెట్టారని గుర్తు చేశారు. అంతేగాకుండా ఆనాటి ప్రజల స్థితిగతులు, అవిద్య, సాంఘిక దురాచారాలు, సతీసహగమనం, బాల్య వివాహాలను నిర్మూలించడానికి అవసరమైన చైతన్యం పెరగాలంటే విద్య అందరికీ అందుబాటులోకి రావాలని మొదటిసారిగా మహిళలకు పాఠశాల ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరి తోపాటు మహిళలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు స్ఫూర్తిదాయకం

గుత్తి : సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని జెడ్ వీరారెడ్డి భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ దేశ సామాజిక మార్పు కోసం సావిత్రిబాయి పూలే ఎంతో వృషి చేశారన్నారు. సమాజ ప్రగతి కోసం తుదిశ్వాస వరకు నిర్విరామంగా పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కెపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ నాయక్, మల్లికార్జున, ఐద్వా మండల


గుత్తిలో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

అధ్యక్షురాలు కవిత, వ్యవసా కార్మిక సంఘం నాయకురాలు మున్ని, సిఐటి నాయకులు నిర్మల, దస్తగిరి, రైతు సంఘం నాయకులు రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సాంఘిక దూరాచారం, సతీసహగమనం, బాల్య వివాహాలు వంటి వాటిని తిప్పికొట్టాలంటే చదువు ముఖ్యమని భావించి బాలికలు, మహిళలకు చదువు చెప్పిన సామాజిక వైతాళికురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని వక్తలు కొనియాడారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.ప్రభాకర్, ఐద్వా పట్టణ కార్యదర్శి జ్యోతి, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు రంగమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు కిశోర్, జాక్, దివాన్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్ : సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక విభాగం సమన్వయకర్త పరీసాఫిర్దోస్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల చెరువులో పాచి తొలగింపు

శింగనమల : మండల కేంద్రంలోని చెరువు మరువలో పట్టిన పాచిని మంగళవారం తొలగించారు. దాదాపు మూడు నెలలుగా చెరువు మరువ పారుగుతున్న విషయం తెలిసిందే. దీంతో మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయ బృందం మరువలో పాచిని జెసిబిల ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకుడు కెసి ఆనంద్ మాట్లాడుతూ మరువలో పాచి పట్టడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో తమవంతుగా జేసీబీతో పాచిని తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రమేష్, కిష్ట, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఆశాడే

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకత, వాటిని ఏయే నెలల్లో.. ఏ డోసులు వేస్తామనే విషయాలను వైద్యసిబ్బంది వివరించారు. ఆశా మొబైల్‌లో కొత్త యాప్‌ను ప్రవేశపెట్టారు. ఈయాప్‌లో గర్భిణుల వైద్య వివరాలు పొందుపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సీహెచ్ఓ చంద్రావతి, ఎంపీహెచ్ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, పిహెచ్ ఎన్.తులశమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దపప్పూరు : రైతుల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నామనాంకుపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రైతు పక్షపాతి అన్నారు. ఇందులో భాగంగానే రైతులకు అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రైతు భరోసా, బీమా, సబ్సిడీ ద్వారా డ్రిప్ పరికరాల పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అశ్విని, ఉపాధి పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, వైసిపి మండలాధ్యక్షుడు రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు బొందలదిన్నె రామయ్య, శివారెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, ఎంపిడిఒ రామకృష్ణ, మండల ఇంజినీర్ ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ రవిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

'బాబు' యాత్రలను అడ్డుకునేందుకే చీకటి జీవో

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు


ప్రభుత్వ ఉత్తర్వులను కాల్చి వేస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి అధినేత చంద్రబాబుకు వస్తున్న విశేష ప్రజాదరణను చూసి ఓర్వలేకనే జగన్ ప్రభుత్వం రోడ్‌షోలను నియంత్రించేందుకు చీకటి జీఓ తెచ్చిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. రోడ్‌షోలను నియంత్రించాలని సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 01 ప్రతులను గుమ్మఘట్ట మండలంలోని పైదొడ్డి గ్రామంలో మంగళవారం సాయంత్రం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న జగన్ పోలీసు, భద్రతా వలయాల మధ్య పరదాల మాటున బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం లేని సిఎం ప్రతిపక్షాల కార్యకలాపాలను బలవంతంగా నియంత్రించేందుకు రోడ్‌షోలు, బహిరంగ సభలపై నిషేధాన్ని విధిస్తోందన్నారు. అంతేగాకుండా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర త్వరలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో వెలువడిన జీవోపై అనేక అనుమానాలున్నాయన్నారు. బ్రిటిష్ కాలం నాటి 1861 పోలీస్ చట్టం ఆధారంగా అర్ధరాత్రి ఒకటో నెంబర్ జి.ఓను తీసుకొచ్చి, ప్రజాస్వామ్యాన్ని జగన్మోహన్ రెడ్డి ఖునీ చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఇలాంటి జిఓల వల్ల జగన్ రెడ్డి మరింత ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకోవడం మినహా సాధించేది ఏమీ ఉండదన్నారు. ఇలాంటి దుర్మార్గమైన జీఓ ల ద్వారా ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోన్న జగన్‌రెడ్డి దుష్టపాలనను అంతం చేయడానికి ప్రజాస్వామ్యవాదులందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ పూల నాగరాజు, మండల కన్వీనర్ గిరిమల్లప్ప, జిల్లా రైతు అధికార ప్రతినిధి దానవేంద్ర, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి

ఎపి సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రవి


మాట్లాడుతున్న ఎపి సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రవి

ప్రజాశక్తి-గుంతకల్లు

సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని ఎపి సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రవి డిమాండ్ చేశారు. ఎపి సంచార జాతుల రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇందిరాదేవి అధ్యక్షత మంగళవారం స్థానిక బీరప్ప కూడలి నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన దేశవ్యాప్తంగా సంచార జాతుల ప్రజలు సామాజిక వివక్షకు గురవుతున్నారన్నారు. వారిని ప్రభుత్వాలు కేవలం ఓటుబ్యాంకుగానే వాడుకుంటూ వదిలేస్తున్నారన్నారు. సంచార జాతులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే రాజ్యాంగంలోని మూడవ షెడ్యూలులో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అట్రాసిటీ చట్టం అమలు చేయాలని, జీవనోపాధికి 90 శాతం సబ్సిడీపై ఒక్కొక్కరికి రూ.2లక్షలు రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్, టిడిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్టు కుళ్లాయప్ప, ఎంబిసి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్, మొండిబండ సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ, కౌన్సిలర్ చిన్నం వెంకటేసులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా నాయకుడు రాజారామ్‌రెడ్డి

తాడిపత్రి : కల్తీ పత్తి విత్తనాలు విక్రయించి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చిన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజారామ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కల్తీ పత్తి విత్తనాల సరఫరా చేసి రైతులకు నష్టాన్ని మిగిల్చిన విత్తన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.60 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాలు ఇచ్చి రైతులను ముంచిన ప్రయివేటు విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, రానున్న పంట కాలానికి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, పంటకోత ప్రయోగాలను ప్రయివేట్ బీమా కంపెనీలు కాకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించాలని, డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 5వతేదీన కర్నూలులోని ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి నారాయణరెడ్డి, రెడ్డి రమేష్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

రాయదుర్గం : పట్టణంలోని 14వ వార్డులో క్రమున్‌బీ (33) అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులకు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్ వైఎస్‌ఆర్ బీమా కింద తక్షణ సాయం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వలిబాషా, మున్సిపల్ వార్డు సభ్యులు డిష్ గోవిందా, ఫక్రుద్దీన్, వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కాన్ఫరెన్స్ హల్ మంగళవారం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ఇందులో భాగంగా గతేడాది మరణించిన ల్యాబ్ టెక్నీషియన్ బాబురావు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కృష్ణవేణి, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్‌బాబు, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సుజాత, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డిపిఎంఒ డాక్టర్ చెన్నకేశవులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోసెస్ ప్రభాకర్, అసోసియేషన్ సభ్యులు వేణుగోపాల్,పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల అందజేత

రాయదుర్గం : పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులకు భద్రావతి, భావన ఋషి పంచలోహ విగ్రహాలను దాతలు బహుకరించారు. భీమనపల్లి నాగరాజు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు మురళీకృష్ణ, భానుప్రకాష్ సుమారు రూ.లక్ష విలువజే విగ్రహాలను మంగళవారం ఆలయ ఆవరణలో పద్మశాలి బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షులు అరవ శివప్పకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త ముకుంద, ఉపాధ్యక్షులు పాండు, సిద్ధప్ప, కోశాధికారి రామచంద్రప్ప, ప్రచార కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జింక వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని టి.వీరాపురం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 77 మంది విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపీణి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మల్లికార్జున, సర్పంచి ఓబులమ్మ, ఎంపిటిసి రాజమ్మ, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గార్లదిన్నె : ప్రజల కష్టాలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి న్నారు. మంగళవారం మండల కేంద్రంలో పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు సంవత్సరాల తరబడి వేచి ఉండే వారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక అర్హులందరికీ ప్రతినెలా 1వ తేదీన వాలంటీర్లే ఇళ్ల వద్దకు వచ్చి అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎంపిపి వెంకటనారాయణ, మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఒ విజయభాస్కర్ పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో పెంచిన పింఛన్లను సర్పంచి చిప్పగిరి ప్రకాష్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతలవారీగా 2500 ఉన్న పింఛన్లను నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రూ.2,750 చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచు వన్నూరుసాబ్, వైసిపి నాయకులు నరిగన్న, అంగడి ఎర్రస్వామి, శ్రీనివాసులు, వార్డ్ మెంబర్ చంద్రశేఖర్, అంజినప్ప, వైసిపి సోషల్ మీడియా తిప్పేస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం విడపనకల్లు మండలానికి చెందిన గ్రామ సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు, వైస్సార్సీపీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం ఉరవకొండ వీరశైవ కల్యాణ మండపంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న నాయకులు, మాజీ జెడ్పిటిసి సింగాడి వైసిపి రాష్ట్ర నాయకులు రణం భీమరెడ్డి, భరత్‌రెడ్డి, ఉరవకొండ పట్టణ అధ్యక్షుడు బ్యాంక్ ఓబులేసు, సర్పంచులు గీతమ్మ, రామాంజనేయరెడ్డి, మోదుపల్లి రామాంజనేయులు, ఎంపిటిసిలు తిమ్మరాజు, కళావతి, రాజమ్మ, విడపనకల్లు పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ డోనేకల్లు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను అందజేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందజేయడంతో వాలంటీర్ల పాత్ర కీలకమని పరిశీలకులు, చిత్తూరు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు అధ్యక్షతన ఆయన తోటలో మంగళవారం వాలంటీర్లు, వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. అప్పుడే పార్టీకి, నాయకులకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, నాయకులు త్రిలోక్‌నాథ్‌రెడ్డి, దుద్దేకుంట రామాంజనేయులు, అధ్యక్షులు శివలింగప్ప, జి.శ్రీనివాసులు, పాటిల్ నాగిరెడ్డి, సర్పంచి సాలిబాయి, గంగ్యానాయక్, రామిరెడ్డి, పురుషోత్తం, మారుతీరెడ్డి, వెంకటరెడ్డి, కరుణాకర్, బాబురెడ్డి, శీనానాయక్, తిప్పేస్వామినాయక్, ఎంపిటిసిలు ప్రసాద్, పుష్పావతి, కె.గోపాల్, వాలంటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ అజెండా అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వాసవీకళ్యాణ మండపంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించాలన్న ఉద్యేశంతోనే సిఎం జగన్ వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఆయా వ్యవస్థల ద్వారా అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, నాయకులు కచ్చిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటనారాయణ, చెన్నకేశవులు, బంగారు అలీబాషా, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.


శింగనమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతిచెందిన ప్రతాప్‌రెడ్డి

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని చింతలంపల్లి గ్రామంలో చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో ప్రతాప్‌రెడ్డి (30) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారి జిల్లా కంప్లి కొట్టాలకు చెందిన ప్రతాప్‌రెడ్డి రెండు రోజుల నుండి కంది పంట కోత మిషన్‌తో పనులు చేస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం మిషన్‌పై ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా టాప్‌పైకి ఎక్కడంతో విద్యుత్ తీగలు తగిలి కింద పడ్డాడు వెంటనే పొలంలో ఉన్న రైతులు ఆటోలో గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు రూరల్ పోలీసులు మృతదేహన్ని శవ పరీక్షల నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రదర్శనలు, సభలను అడ్డుకోవడం అప్రజాస్వామికం

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు కోశాధికారి నాగమణి, నాగేంద్రకుమార్, గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పిచ్చితుగ్లక్ పరిపాలన సాగుతోందన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకుని సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. ఈ జీవో అమలు చేయడమంటే ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కేయడమే అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఉర్దూ అకాడమీ అభివృద్ధికి కృషి

అనంతపురం : గత ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన ఉర్దూ అకాడమీని శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఉర్దూ అకాడమి ఛైర్మన్ హిరియల్ నదీమ్‌అహ్మద్ అన్నారు. ఉర్దూ అకాడమీ అభివృద్ధిపై నగరంలోని పెనార్‌భవన్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉర్దూ అభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. సిఎం సూచనలతో మరిన్ని నిర్ణయాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దవడుగూరు కెజిబివి తనిఖీ

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కొంతసేపు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం మెనూను పరిశీలించారు. చిక్కీల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పదో తరగతితో వందశాతం ఫలితాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, ఎంఇఒ రాముడు, విఆర్ఒ కుళ్లాయిస్వామి, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుగుమర్రిలో 'ఇదేమి ఖర్మ'

నార్పల : మండలంలోని దుగుమర్రి గ్రామంలో మంగళవారం ఇదేం ఖర్మ, మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తోందన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలు, లభించని ఇసుక, పెరిగిన సిమెంటు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు, ఇష్టానుసారంగా పెంచిన కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, బస్సుఛార్జీలను పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు సుఖంగా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

పంట పొలాల పరిశీలన

ఉరవకొండ : మండల పరిధిలోని ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో రైతులు సాగుచేసిన పప్పుశనగ, వేరుశనగ, మిరప, బొప్పాయి తదితర పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పంటలకు వ్యాపిస్తున్న రోగాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిడిఒ మద్దిలేటి, శివశంకర్‌నాయక్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కెవికె శాస్త్రవేత్త చెన్నరాయుడు, ఉరవకొండ ఎడిఎ పద్మజ, ఎఒ శశికళ, ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు, రైతులు, స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉరవకొండ : ఉరవకొండతోపాటు విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాలో యుటిఎఫ్ రూపొందించిన నూతన క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ప్రతినెలా 1న జీతాలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు ఎంఇఒ ఎర్రిస్వామి, రామప్పచౌదరి, ఆధ్యక్షులు శ్రీధర్, శేఖర్, ప్రధాన కార్యదర్శి రఘు, గౌరవాధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, ఉపాధ్యక్షులు జయరాములు, కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌రఫీ, ఇర్షద్‌బాషా, మల్లికార్జున, శివకుమార్, సరిత, శ్రీదేవి, విజయ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్‌కు గుత్తి క్రీడాకారుడు ఎంపిక

గుత్తి : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్ 14 ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలకు గుత్తి క్రీడాకారుడు ఎం.భువనేశ్వర్ ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెలలో నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో భువనేశ్వర్ రాణించడంతో అండర్ 14 కు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విజయవాడలోని మూలపాడులో జరిగే అండర్ 14 ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీల్లో భువనేశ్వర్ పాల్గొంటాడని తెలిపారు. ఎంపిక పట్ల ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, కోచ్ లు యుగంధర్ రెడ్డి, ఆర్.కుమార్, మహేశ్వర్ అభినందించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

నార్పల : మండల కేంద్రంలో లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, అన్సెట్ సీఈవో కేశవనాయుడు మంగళవారం పరిశీలించారు. అంతకుముందు సంబంధిత అధికారులతో పీఎం హౌసింగ్ గ్రామీణ ప్రగతిని సమీక్షించారు. ఈ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి జి.లక్ష్మీనరసింహా, హౌసింగ్ ఎఇ నవీన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే తనిఖీ

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని దేవుని ఉప్పలపాడులో చేపట్టిన భూరీసర్వేను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడుతూ రీసర్వే వల్ల ఉపయోగమా.. లేదా.. అని అడిగి తెలుసు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు రైతులు స్పందిస్తూ రీ సర్వే మంచి పరిణామమని, అయితే గెట్లు అటూ, ఇటూ అయితే కొంత సమస్యల వస్తోందని, అందుకు అందరూ ఒప్పుకుంటే ఇబ్బంది లేదని రైతులు తెలపగా, స్పందించిన జెసి ఎవరికీ నష్ట జరగకుండా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, సర్వే ఇన్స్‌పెక్టర్ చిన్న, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి

బ్రహ్మసముద్రం : విద్యారంగ అభివృద్ధికి ఎల్లవేళలా పాటు పడతామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిరాం, రామాంజనేయులు తెలిపారు. ఈమేరకు యుటిఎఫ్ రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీ, పదో తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరించారు. ముందుగా సంఘ సంస్కర్త, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఓబులపతి, సీనియర్ నాయకులు మారుతి, కదిరప్ప, రామాంజనేయులు, వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్‌నాయక్, చైతన్య, గంగరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.